సాక్షి విశాఖపట్నం

బుధవారం : 9 : ఆగస్టు : 2023



భాగస్వామ్యం.. బలోపేతం

విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందిం చాలనే ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. 8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. 8లో



'హ్యుటగాగీ'తో ప్రతిభ వెలికితీత

ఓ టీచర్ రూపొందించిన 'హ్యుటగాగీ' విద్యాబోధన విద్యా వ్యవస్థలో కొత్త విప్లవానికి నాంది పలుకుతోంది. 8లో

తాగి నడిపితే జైలే..!

- మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలు
- వారం రోజులుగా వరస సంఘటనలు
- రోడ్డు ప్రమాదాల కారణంగా 7 నెలల్లో 166 మంది దుర్మరణం
- డ్రంకన్ డ్రైవ్ చేసే వారిపై కఠిన చర్యలకు పోలీసుల సమాయత్తం



దొండపర్తి: మందుబాబుల 'స్పీడ్'కు బ్రేకులు పడనున్నాయి. మద్యం తాగి వాహనాలు నడిపే వారి కిక్కు దిగనుంది. పూటుగా మద్యం తాగి ఒళ్లు తెలియకుండా వాహనాలతో రోడ్ల మీద వచ్చే వారికి చుక్కలు చూపించేందుకు నగర పోలీసులు సమాయత్తమయ్యారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారికి జరిమానాలతో పాటు కటకటాల్లోకి పంపించనున్నారు. కోవిడ్ తర్వాత బ్రీత్ అనలైజర్ టెస్టులను తాత్కాలికంగా నిలిపివేసిన పోలీసులు.. ఇటీవల జరుగుతున్న వరస ప్రమాదాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి జంక్షన్‌లోనూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టనున్నారు.

నగరంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసులు ప్రణాళికాబద్ధ చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన ప్రాంతాల్లో సిగ్నల్స్ ఏర్పాటు, స్టాపర్లు, మలుపులు ఉన్న రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు, భారీ వాహనాలు నగరంలోకి రాకుండా మళ్లింపు, ప్రతీ జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీస్‌తో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవడంతో రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయి. అయితే కొంత మంది మందుబాబులు మాత్రం మద్యం తాగి రోడ్ల మీద వాహనాలతో రెచ్చిపోతున్నారు. కొందరు ఒంటి మీద తెలివిలేకుండా వాహనాలను నడిపి సెల్ఫ్ యాక్సిడెంట్‌కు గురైతే.. మరికొందరు ఇతర వాహనాలను ఢీకొడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అమాయకుల ప్రాణాలు తీస్తున్నారు.

ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం మద్యం తాగి వాహనాలు నడిపే వారి కారణంగానే సంభవించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నెలలోనే వరసగా మందుబాబులు వాహనాలతో బీభత్సం సృష్టించారు. వీఐపీ రోడ్డులో కార్‌ను బైక్‌లపైకి ఎక్కించిన ఘటనలో అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. తాజాగా రాడిసన్ బ్లూ హోటల్ సమీపంలో ఓ కారుపై అతివేగంగా వస్తూ.. అదుపు చేయలేక అవతలి రోడ్డులో బైక్‌పై వెళుతున్న జంటను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఆ జంట అక్కడికక్కడే మృతి చెందగా.. కారులో ఉన్న ఆరుగురిలో ఒకరు మరణించారు. కారులో ఉన్న వారందరూ మద్యం తాగుతూ వాహనాన్ని నడిపి ఇద్దరు అమాయకుల ప్రాణాలు తీశారు.

ఇక ప్రత్యేక డ్రైవ్

కోవిడ్ మహమ్మారి వ్యాప్తిని అరికట్టేందుకు పోలీసులు బ్రీత్ అనలైజర్ టెస్టులు నిలిపివేశారు. అయితే ఇటీవల మద్యం మత్తులో ప్రమాదాలు జరుగుతుండటంతో.. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేపడుతున్నారు. ఈ క్రమంలో కొంత మంది మందుబాబులు ప్రధాన జంక్షన్లలో పోలీసుల తనిఖీలు తప్పించుకోడానికి.. వీధి రోడ్ల మీద ప్రయాణిస్తున్నారు. పోలీసుల కళ్లు గప్పి ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్‌షాపులు ఉన్న ప్రదేశాల వివరాలు, అక్కడ పరిస్థితులపై సమీక్ష చేశారు. బార్ నుంచి వచ్చిన కొద్ది దూరంలోనే వాహన ప్రమాదాలు జరుగుతుండడంతో బార్ అండ్ రెస్టారెంట్ పరిసర ప్రాంతాల్లోనే తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. బార్లు, వైన్ షాపుల్లో తనిఖీల బాధ్యతలను జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్‌కు అప్పగించారు.

రోజూ 100 నుంచి 120 మందిపై కేసులు

పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు విస్తృతం చేశారు. రోజుకు 100 నుంచి 120 మంది మందుబాబులను గుర్తించి.. వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఎక్కువ సార్లు దొరికిన వారిని జరిమానాతో పాటు మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి 2 రోజుల పాటు రిమాండ్‌కు పంపిస్తున్నారు. ప్రస్తుతం ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో మరింత విస్తృతంగా తనిఖీలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రతి ప్రాంతంలోనూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేయనున్నారు.

బీచ్‌రోడ్డులో ప్రత్యేక తనిఖీలు

ప్రధానంగా బీచ్‌రోడ్డులో పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. నిత్యం పర్యాటకులతో రద్దీగా ఉండే బీచ్‌రోడ్డులో మందుబాబులు వాహనాలపై అతివేగంగా వెళుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో శాండ్ పెట్రోలింగ్ మాదిరిగా.. బీచ్‌రోడ్డులో ప్రత్యేక పెట్రోలింగ్ చేయాలని భావిస్తున్నారు. అతివేగం, ర్యాష్‌గా వాహనాలు నడిపే వారితో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిపై దృష్టిసారించనున్నారు. ఈ బాధ్యతలను జోన్-1 ట్రాఫిక్ ఏసీపీ జాన్ మనోహర్‌కు అప్పగించారు. ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది బ్రీత్ అనలైజర్లు, కెమెరాలతో తనిఖీలు నిర్వహించనున్నారు.

ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు



మద్యం తాగి వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. మద్యం తాగిన సమయంలో వాహనం నడిపేందుకు ఒకరిని తోడు తెచ్చుకోవాలి. తల్లిదండ్రులు పిల్లలకు బైక్‌లు ఇవ్వడమే కాదు.. వారు ఏ విధంగా వాహనాలు నడుపుతున్నారో, ఎటువంటి పరిస్థితుల్లో ఇంటికి వస్తున్నారో గమనించాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఈ మధ్య మద్యం తాగి వాహనాలు నడిపే వారి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటువంటి వారిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నాం. బ్రీత్ అనలైజర్ టెస్టులు విస్తృతం చేస్తున్నాం. ఒకటి, రెండు సార్లు దొరికితే జరిమానా విధిస్తాం. పద్ధతి మార్చుకోని వారిని రిమాండ్‌కు పంపిస్తాం.

– డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ, నగర పోలీస్ కమిషనర్

11న స్థాయీ సంఘ సమావేశం

ఎజెండాలో 48 అంశాలు



డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 11న మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో 48 అంశాలపై సభ్యులు చర్చించనున్నారు. జోన్-2 పరిధి 8వ వార్డులో ఫేమ్స్ హరిజోన్ నుంచి శాంతినగర్ కల్వర్టు వరకు రూ.49.70లక్షలతో రోడ్డు విస్తరణ, ఫేమ్స్ కోసం విద్యుత్ స్తంభం ఏర్పాటుకు పరిపాలన అనుమతి, జోన్-4లో 2023-24 ఏడాదికి సంబంధించి బుబాస్ ఫర్నిచర్ వాణిజ్య సముదాయంలో 2వ షాపు బహిరంగ వేలం(అద్దె), జోన్-5లో షాదీఖానా కల్యాణ మండపం బహిరంగ వేలం(అద్దె), జోన్-3 పరిధి 27వ వార్డు డైమండ్ పార్క్ జంక్షన్ నుంచి ఐసీఐసీఐ బ్యాంక్ జంక్షన్ వరకు రూ.31.10లక్షలతో బీటీ రోడ్డు పునరుద్ధరణ, రూ.28 లక్షలతో హిందూ, ముస్లిం కాలనీలో శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం, జోన్-4 పరిధి 39వ వార్డులో రూ.35.75 లక్షలతో డాక్టర్ డీన్ షాదీఖానాకు వంట గది, సీసీ టైల్స్, ప్రహరీ, 12 ఏసీలు, ఇతర పనులు చేసేందుకు పరిపాలన పరమైన ఆమోదానికి చర్చకు రానున్నాయి. రూ.40.65 లక్షలతో డాక్టర్ డీన్ షాదీఖానా బిల్డింగ్‌లో మొదటి అంతస్తు నిర్మాణం, రూ.37 లక్షలతో బాబూలాల్ జిమ్ మొదటి అంతస్తు, రూ.49 లక్షలతో గాజువాక జోన్ 67వ వార్డు హైస్కూల్ నుంచి జోగవానిపాలెం వరకు సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, రూ.35 లక్షలతో 69వ వార్డు నాతయ్యపాలెం బంగారమ్మ గుడి నుంచి గోదావరి లేఅవుట్ వరకు బీటీ రోడ్డు తదితర అంశాలు ఈ సమావేశంలో చర్చకు రానున్నాయి.

న్యూస్‌రీల్

వాల్తేరు డివిజన్‌లో భద్రతకు పెద్దపీట



మాట్లాడుతున్న డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ భద్రతా ప్రమాణాల విషయంలో అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం దొండపర్తిలోని తన కార్యాలయంలో డీఆర్‌ఎం అధ్యక్షతన భద్రతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతా ప్రమాణాల మెరుగుకు సంబంధించిన పలు విషయాలు సిబ్బందికి తెలియజేసినట్లు తెలిపారు. లెవెల్ క్రాసింగ్‌లు, బ్రిడ్జిల నిర్వహణ, మలుపులు, టన్నెల్స్, సిగ్నలింగ్ పాయింట్స్, ఇతర ప్రమాదకర ప్రదేశాల్లో సిబ్బంది పాటించాల్సిన నిబంధనల గురించి వివరించినట్లు చెప్పారు. ఈ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రైనీ లోకో పైలట్లు, సేఫ్టీ కౌన్సిలర్లు, సీనియర్ సూపర్‌వైజర్లు, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ మోనిష్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలి



పెందుర్తి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడికి సర్టిఫికెట్‌ను అందిస్తున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణల దిశగా ముందుకెళ్లేలా వారిని ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేసే క్రమంలో జిల్లాలోని సైన్సు ఉపాధ్యాయులకు మంగళవారం నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ఈ ఏడాది ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు నమోదయ్యేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో చదువుకునే విద్యార్థులకు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని, దీనిపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. గతేడాది రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో మంచి ప్రతిభ చూపేలా విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్, విశాఖ, అనకాపల్లి జిల్లాల సైన్సు అధికారులు విశ్వేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా నిధుల జమ

మహారాణిపేట: వైఎస్సార్ కల్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫా నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం 10.30 గంటలకు క్యాంప్ ఆఫీస్ నుంచి విడుదల చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు భారం కాకూడదన్న లక్ష్యంతో ఈ పథకాలను ప్రారంభించారు. మూడో విడత నిధులను వారి తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జిల్లాలో 681 మంది లబ్ధిదారులకు నాలుగు కోట్ల 24 లక్షల 90 వేల రూపాయలు అందించనున్నారు. జిల్లాలో లబ్ధిదారులకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, ప్రజాప్రతినిధుల ద్వారా అందజేయనున్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



సూచనలిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మహారాణిపేట: స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని, డెకాయ్ ఆపరేషన్లు క్రమం తప్పకుండా చేయాలని ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో గర్భస్థ పూర్వ, పిండ లింగ నిర్ధారణ చట్టంపై మంగళవారం ఉప జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆడ పిల్లల నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి.. అక్కడ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం అనే నినాదంతో అవగాహన కల్పించాలన్నారు. స్కానింగ్ కేంద్రాల్లోని రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. నోడల్ అధికారి ఎస్.రమారెడ్డి, వీజీహెచ్ సూపరింటెండెంట్ ఉషాప్రసాద్, గైనకాలజిస్ట్ డాక్టర్ వందన శశికిరణ్, రేడియాలజిస్ట్ ప్రజ్ఞాన్ కుమార్, ఎన్‌జీవో ప్రతినిధి రామలక్ష్మి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, వైద్యులు బి.ఉమావతి, దిశ ఎస్ఐ రూప పాల్గొన్నారు.

మద్యం మత్తు వల్లే కారు ప్రమాదం

ఘటనా స్థలిని పరిశీలించిన సీపీ త్రివిక్రమ్ వర్మ



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

కొమ్మాది: బీచ్‌రోడ్డులో సాగర్‌నగర్ రాడిసన్ బ్లూ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదానికి మద్యం మత్తు, అతి వేగమే కారణమని సీపీ త్రివిక్రమ్ వర్మ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. సోమవారం రాత్రి సాగర్‌నగర్ నుంచి రుషికొండ వైపు అతి వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి రాడిసన్ బ్లూ సమీపంలో బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో రాయగడ ప్రాంతానికి చెందిన పృథ్వీరాజ్ (28), ప్రియాంక (21), మజ్జి మణికుమార్ (20) మృతి చెందారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నగరానికి చెందిన వినయ్ సోమవారం సాయంత్రం ఓ వ్యక్తి వద్ద కారు తీసుకుని బాలు, రవి, భరత్ కుమార్, మణికుమార్, రవికిరణ్‌తో కలిసి జోడుగుళ్లపాలెం వద్ద బీరు బాటిళ్లు తీసుకుని రుషికొండ వైపు బయలుదేరారని తెలిపారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వారంతా సాగర్‌నగర్ ఆర్చి వద్ద యువకులతో వాగ్వాదానికి దిగి రహదారిపై మద్యం సీసాలు పగలగొట్టి హల్‌చల్ చేశారన్నారు. అంతేకాకుండా అక్కడి యువకుల నుంచి సెల్‌ఫోన్ లాక్కొని అతివేగంగా పరారయ్యేందుకు యత్నించగా... సాగర్‌నగర్ రాడిసన్ బ్లూ వద్ద కారు అదుపుతప్పడంతో ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. మద్యం సేవించి ఒకే కారులో ఆరుగురు అతి వేగంగా వాహనాన్ని నడపడమే ప్రమాదానికి కారణమని పేర్కొన్నారు. కారులో మద్యం బాటిళ్లు లభించినట్లు తెలిపారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, ఇప్పటికే డ్రంక్ అండ్ డ్రైవ్‌కు సంబంధించి స్పెషల్ డ్రైవ్ ముమ్మరం చేస్తున్నట్లు సీపీ తెలిపారు. మరోవైపు ప్రమాదంలో మృతి చెందిన రాయగడకు చెందిన పృద్వీరాజ్, ప్రియాంక దంపతులు కాదని పృద్వీరాజ్ కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రియాంక ఎవరనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మరొకరు మృతి



రవికిరణ్ (ఫైల్)

సాగర్‌నగర్ రాడిసన్ బ్లూ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, తీవ్ర గాయాలపాలైన రవికిరణ్‌ను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. అక్కడ చికిత్స పొందుతున్న రవికిరణ్ (20) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ యువకుడి స్వగ్రామం పలాసకాగా నగరంలోని ఎస్‌పీడీ సమీపంలో నివసిస్తున్నాడు.

నేడు క్విట్ మోదీ-సేవ్ వైజాగ్ స్టీల్ దీక్ష

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం క్విట్ మోదీ-సేవ్ వైజాగ్ స్టీల్ దీక్ష నిర్వహిస్తున్నారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశంలోని అన్ని పరిశ్రమల వద్ద నిరసనలు ఏర్పాటు చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో పాత గాజువాకలోని అనకాపల్లి వైపు బస్టాప్ వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరసన దీక్ష జరగనుంది. ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు పెద్ద సంఖ్యలో హాజరై దీక్షను విజయవంతం చేయాలని పోరాట కమిటీ నాయకులు కోరారు.

నా మట్టి.. నా దేశం!

- 'నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనం'
- నేటి నుంచి అన్ని పంచాయతీల్లో ప్రారంభం
- పంచాయతీల్లో సేకరించిన మట్టి కలశాలు ఢిల్లీకి..
- ఉపాధి హామీ నిధులతో మొక్కలు, శిలా ఫలకాలు
- ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో మార్గదర్శకాలు జారీ



సాక్షి, విశాఖపట్నం: ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడానికి, వారిని ఉత్తేజ పరచడానికి 'నా మట్టి-నా దేశం', 'నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం' పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దీనిని చేపడుతోంది. ఈనెల 9 నుంచి 15 వరకు గ్రామ పంచాయతీలు, మండల ప్రధాన కార్యాలయాలు, పట్టణ ప్రాంతాల్లోనూ నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఏం చేస్తారంటే.. ఆయా గ్రామాల్లోని దేశం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, రక్షణ రంగం, కేంద్ర సాయుధ దళాలు, పోలీసు శాఖల్లో పని చేసి పదవీ విరమణ చేసిన వారిని లేదా ప్రాణాలర్పించిన వారి కుటుంబ సభ్యులను గ్రామస్తుల సమక్షంలో ఘనంగా సత్కరిస్తారు. ఆ త్యాగమూర్తుల పేరిట శిలాఫలకాలను ఏర్పాటు చేస్తారు. వాటి చుట్టూ దీపాలంకరణ చేసి వారి త్యాగాలను స్మరించుకుంటూ కృతజ్ఞతలు తెలియజేస్తారు. వారితో ప్రతిజ్ఞ చేయిస్తారు. జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపిస్తారు. శిలాఫలకాల వద్ద ఉన్న మట్టిని కలశాల్లోకి సేకరించి మండల కేంద్రానికి, ఆ తర్వాత జిల్లా కేంద్రానికి పంపిస్తారు. మండలానికో యువకుడిని ఎంపిక చేసి వారితో ఆ మట్టి కలశాలను దేశ రాజధాని ఢిల్లీకి పంపిస్తారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దీర్ఘకాలం ఉండే 75 మొక్కలను అనువైన చోట నాటుతారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న వారికి సర్టిఫికెట్లు కూడా అందజేస్తారు.

'ఉపాధి' నిధులతో..

ఈ కార్యక్రమంలో శిలాఫలకాలు ఏర్పాటు, మొక్కలు కొనుగోలు, నాటడం సహా ఇతర ఖర్చులను ఉపాధి హామీ నిధుల నుంచి ఖర్చు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. అలాగే శిలాఫలకాల రూపకల్పనకయ్యే ఆర్ట్‌వర్క్ సమాచారాన్ని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. జిల్లా అటవీ శాఖ, ఉద్యాన శాఖ, డ్వామా పీడీలు సమన్వయం చేయాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తారు.

విజయవంతం చేయండి



మహారాణిపేట: 'నా మట్టి-నా దేశం', 'నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంపై మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 9 నుంచి 15 వరకు అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సందేశంతోపాటు స్వాతంత్ర్య సమరయోధులు, త్యాగధనులు, వీరులను గుర్తు చేసుకుంటూ ఎంపిక చేసిన అమృత సరోవర్లు, నీటి వనరుల వద్ద శిలాఫలాకాలను ఏర్పాటు చేసుకొని సెల్ఫీలు దిగి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని పిలుపునిచ్చారు. 16 నుంచి 20 వరకు మండల, అర్బన్ ప్రాంతాల్లో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, యుద్ధవీరులు, పోలీసులు, డాక్టర్లను భాగస్వామ్యం చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 13 నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి, డీఈవో చంద్రకళ, డీఆర్‌డీఏ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం..



నా మట్టి-నా దేశం.. 'నేలతల్లికి నమస్కారం.. వీరులకు వందనం' కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. జాతీయత, సమైక్యతా భావాన్ని పదిమందిలో స్ఫూర్తి కలిగించడానికి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 975 గ్రామాల్లోనూ ఈనెల 9 నుంచి చేపడతారు. దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకోవడం, ఇంకా జీవించి ఉన్న ఇలాంటి వారిని ఘనంగా సత్కరించడం దీని ముఖ్య ఉద్దేశం. గ్రామాల్లో శిలా ఫలకాలను సిద్ధం చేస్తున్నాం. ప్రతి గ్రామంలోనూ పండగ వాతావరణంలో దీనిని నిర్వహిస్తాం.

– శ్రీరామ్మూర్తి, జెడ్పీ సీఈవో, విశాఖపట్నం

కార్డియాలజీ విభాగానికి కార్పొరేట్ లుక్

రూ.24 లక్షల సీఎస్సార్ నిధులతో ఆధునికీకరణ పనుల ప్రారంభం



కేజీహెచ్ కార్డియాలజీ విభాగం

మహారాణిపేట: కేజీహెచ్‌లోని కార్డియాలజీ విభాగానికి మంచి రోజులొచ్చాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత కేజీహెచ్‌లోని ఒక్కొక్క విభాగాన్ని ఆధునికీకరిస్తున్నారు. ఇందులో భాగంగా శిథిలావస్థకు చేరుకున్న హృద్రోగ విభాగం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు. గతంలో ఇక్కడి కీలక పరికరాలు మూలకు చేరగా.. మరికొన్ని మరమ్మతులకు గురయ్యాయి. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీ చేయడం కోసం ఇటీవల టెంపరేచర్ కంట్రోల్ మిషన్‌ను ప్రభుత్వం సమకూర్చింది. ఈ మిషన్ లేక కొన్ని రోజులుగా ఆగిన శస్త్రచికిత్సలు ఇటీవలే మొదలయ్యాయి. ఈ క్రమంలో వార్డు ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. సీఎస్సార్ నిధులు రూ.24లక్షలతో వార్డులో సౌకర్యాలు సమకూరుస్తున్నారు. సీలింగ్, ఫ్లోరింగ్, సెంట్రల్ ఏసీ, మంచాలు తదితర వసతుల కల్పనకు టెండర్లు ఖరారయ్యాయి. ఆంధ్రప్రదేశ్ మెడికల్ మౌలిక సదుపాయాల సంస్థ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

కేజీహెచ్‌లోని ప్రధాన విభాగాల్లో కార్డియాలజీ విభాగం ఒకటి. ఇక్కడ ఓపీ రోజుల్లో రద్దీగా ఉంటుంది. ప్రతీ సోమవారం, బుధవారం, శుక్రవారం ఓపీ నిర్వహిస్తారు. గుండె నొప్పి, బీపీ, పల్స్ పెరుగుదల, తగ్గుదల, ఆయాసం తదితర వ్యాధిగ్రస్తులు వస్తారు. అత్యవసర రోగులను వార్డులో జాయిన్ చేస్తారు. ప్రతి రోజూ ఓపీకి 30 నుంచి 40 మంది వరకు రోగులు వస్తారు. ఐసీయూలో 5 నుంచి 10 మంది వరకు రోగులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఇక్కడ చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన రోగులు నెలకు ఒక సారి తనిఖీల కోసం వస్తారు. వైద్యులు ఆ రోగిని పరీక్షించి, నెలకు సరిపడే మందులు ఉచితంగా ఇస్తారు. ఇలాంటి రోగులు రోజుకు 5 నుంచి పది మంది వరకు ఉంటారు. కార్డియాలజీ విభాగం రెండో అంతస్తులో గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సలు చేస్తున్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం



కార్డియాలజీ వార్డును ఆధునీకరిస్తున్నాం. రోగులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఈ పనులు చేపట్టేందుకు కలెక్టర్ అనుమతి ఇచ్చారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం. ఇప్పటికే గుండె శస్త్రచికిత్సలు ప్రారంభించాం.

– డాక్టర్ పి.శివానంద్, సూపరింటెండెంట్ కేజీహెచ్

చురుగ్గా రెండో క్యాజువాలిటీ పనులు



క్యాజువాలిటీలో జరుగుతున్న పనులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో రెండో క్యాజువాలిటీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కార్పొరేట్ సేవలు అందిస్తున్న కేజీహెచ్‌కు రోగుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రస్తుతం క్యాజువాలిటీలో పడకలు సరిపోవడం లేదు. దీంతో మరో క్యాజువాలిటీ నిర్మించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తయారు చేసిన ప్రతిపాదనలకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆమోద ముద్ర వేశారు. ఇందుకు అవసరమైన రూ.30 లక్షల నిధులను మంజూరు చేయడంతో టెండర్లు పిలిచి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.15 లక్షలు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నుంచి, మరో రూ.15 లక్షలు సీఎస్ఆర్ నిధుల నుంచి ఖర్చు చేస్తున్నారు. క్యాజువాలిటీలో రోగుల కోసం రూ.15 లక్షలతో లేబొరేటరీ నిర్మిస్తున్నారు. అలాగే మొబైల్ ఎక్స్‌రే యూనిట్, అల్ట్రా స్కానింగ్ సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం కేజీహెచ్ క్యాజువాలిటీలో 20 పడకలకు పైగా ఉన్నాయి. ఇక్కడ రోజుకు 20 నుంచి 40 మంది వరకు చికిత్స పొందుతుంటారు. ఆస్పత్రికి వచ్చే ఎటువంటి అత్యవసర కేసు అయినా తొలుత క్యాజువాలిటీలో ప్రథమ చికిత్స చేస్తారు. అనంతరం వార్డులకు తరలిస్తారు. ఆ ప్రకారం క్యాజువాలిటీ రద్దీ నివారించడం కోసం 20 పడకలతో రెండో క్యాజువాలిటీ నిర్మిస్తున్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాయుడు ఆధ్వర్యంలో డీఈ మన్మధరావు పనులు పర్యవేక్షిస్తున్నారు. ఆధునిక సౌకర్యాలు, సెంట్రల్ ఎయిర్ కండిషన్, పడకలు, ఆక్సిజన్, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ క్యాజువాలిటీకి టైల్స్ వేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో రెండో క్యాజువాలిటీని ప్రారంభించే దిశగా పనులు శరవేగంగా చేస్తున్నారు.

లభించని యువకుడి ఆచూకీ

పెదగంట్యాడ: పాత గంగవరం తీరంలో సోమవారం గల్లంతైన యువకుడు షేక్ నాగూర్ సాహెబ్(24) ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. మంగళవారం సాయంత్రం వరకు కోస్టుగార్డు సిబ్బందితో పాటు నేవీ సిబ్బంది హెలికాప్టర్‌లో సముద్రంలో గాలించినా ఫలితం లేకపోయిందని న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ సువ్వారి తెలిపారు. బుధవారం మరోసారి గాలింపు చర్యలు చేపడతామన్నారు.

భాగస్వామ్యం.. బలోపేతం

- ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం
- వారి సమక్షంలోనే విద్యార్థులకు ప్రోగ్రస్ కార్డుల అందజేత
- పరీక్షల్లో సాధించిన మార్కులపై విశ్లేషణ
- రేపు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పేరెంట్, టీచర్ మీటింగ్



అదవివరం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు(ఫైల్)

విశాఖ విద్య: విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందించాలనే ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా జిల్లా విద్యాశాఖాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 145 ప్రాథమిక, 210 ప్రాథమికోన్నత, 420 ఉన్నత పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు లక్ష మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అందిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల మేరకు మన విద్యార్థులు జాతీయ స్థాయిలో పోటీ పడేలా బోధన పద్ధతుల్లో వినూత్నమైన మార్పులు అవలంబిస్తున్నారు. తల్లిదండ్రుల భాగస్వామ్యంతో బడుల బలోపేతానికి పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహించాలని నిర్ణయించారు.

ఏడు సార్లు సమావేశాలు

పాఠశాల విద్యలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం నాడు–నేడు అభివృద్ధి పనులు పేరెంట్స్ కమిటీల ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. బడి బలోపేతంలో భాగంగా పాఠశాల నిర్వహణతో పాటు, విద్యార్థుల చదువుల తీరుతెన్నులపై కూడా తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు చర్చించడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని విద్యారంగ నిపుణుల సూచనలతో అధికారులు కార్యాచరణలోకి దిగారు. రెగ్యులర్ సమావేశాలతో పాటు పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులపై చర్చించేందుకు 2023–24 విద్యా సంవత్సరంలో ఏడు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు.

విద్యార్థులు చదువులో రాణించేలా..

విద్యార్థుల భవిష్యత్‌కు పాఠశాల స్థాయిలోనే పటిష్టమైన పునాదులు పడేలా ప్రభుత్వం విద్యాబోధనలో మార్పులు చేస్తోంది. ఇందుకనుగుణంగానే రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ(ఎస్‌సీఈఆర్టీ) పాఠ్య పుస్తకాల రూపకల్పన చేసింది. ఈ సిలబస్ మేరకే ఫార్మేటివ్, సమ్మెటివ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ప్రగతిపై వారి తల్లిదండ్రులతో చర్చించడం ద్వారా భవిష్యత్‌లో చేపట్టాల్సిన చేర్పులు, మార్పులపై ముందుకెళ్లే అవకాశం ఉంటుందని విద్యాశాఖాధికారులు భావిస్తున్నారు. ఈ నెల 1 నుంచి 4 వరకు ఫార్మేటివ్–1/ క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ పరీక్ష నిర్వహించారు. వీటి మూల్యాంకనం ఇప్పటికే పూర్తయింది. ఇందులో విద్యార్థులు సాధించిన మార్కులతో కూడిన ప్రోగ్రస్ కార్డులను అందించేందుకు సిద్ధం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 10న పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



ఉన్నతాధికారుల ఆదేశాలకు మేరకు పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. దీనిపై విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు సమాచారం అందిస్తున్నాం. అదే రోజు విద్యార్థులకు ప్రోగ్రస్ కార్డులు అందజేస్తాం.

– ఇమంది పైడిరాజు, హెచ్‌ఎం, అదవివరం జెడ్పీ హైస్కూల్

మంచి నిర్ణయం



ఫార్మేటివ్, సమ్మెటివ్ పరీక్షల అనంతరం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించడమనేది మంచి నిర్ణయం. విద్యార్థులు సాధించిన మార్కులపై క్లాస్ టీచర్, సబ్జెక్టు టీచర్‌తో నేరుగా తల్లిదండ్రులు అడిగి తెలుసుకోవచ్చు. తమ పిల్లల చదువులపై తల్లిదండ్రులు మరింత శ్రద్ధ చూపే అవకాశం ఉంటుంది. దీని వల్ల మంచి ఫలితాలు వస్తాయి.

– ధర్మేంద్ర రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయుడు, క్వీన్ మేరీ ప్రభుత్వ బాలికల హైస్కూల్

మా భాగస్వామ్యం పెరిగింది



మా పిల్లలు చదువుకునే స్కూల్లో ఇన్నాళ్లకు సరైన గుర్తింపు దక్కుతుంది. రెండేళ్లుగా పేరెంట్స్ కమిటీలో సభ్యురాలిగా ఉన్నాను. తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. పరీక్షలపై కూడా ప్రత్యేకంగా సమావేశం నిర్వహించడం వల్ల మా పిల్లలు ఎలా చదువుతున్నారో తెలుసుకోవచ్చు.

– జి.దుర్గ, పేరెంట్స్ కమిటీ సభ్యురాలు

ద్వారకా పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌పై దాడి



హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్‌పై సోమవారం రాత్రి కొంత మంది మద్యం సేవించిన యువకులు దాడి చేశారు. శాంతిపురం లాల్ బహదూర్ శాస్త్రి పార్కు సమీపంలో నివసిస్తున్న హెచ్‌సీ ప్రకాష్ సోమవారం రాత్రి విధులు నిర్వహించేందుకు స్టేషన్‌కు బయలుదేరే ముందు ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఎదురుగా పార్కులో ఉన్న కొంత మంది యువకులు మద్యం సేవించి అల్లరి చేస్తుంటే ఇక్కడేమిటి అల్లర్లు అంటూ హెచ్‌సీ ప్రకాష్ అడగ్గా... ఆ యువకులు తిరగబడడంతో ప్రకాష్‌కు గాయాలయ్యాయి. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఫోర్తుటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి దాడికి పాల్పడిన ముగ్గురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తికి జైలు

విశాఖ లీగల్: వివాహం చేసుకుంటానని యువతిని మోసం చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ నగరంలోని 11వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి లాలం శ్రీధర్ మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసెక్యూటర్ బి.వి.ఆర్.మూర్తి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు చిలికి మహేష్(21) నగరంలోని పూర్ణామార్కెట్ ప్రాంతంలో ఉంటున్నాడు. బాధితురాలు ఆర్‌అండ్‌బీ దగ్గర నివసిస్తున్నారు. ఆమె సమీపంలోని మాధవధార వుడా కాలనీలో ఒక స్టేషనరీ షాపులో పనిచేసేది. ఈ నేపథ్యంలో నిందితుడు బాధితురాలు పనిచేసే పుస్తకాల షాప్‌నకు వెళ్లేవాడు. వారి మధ్య పరిచయం ప్రేమగా మారింది. వారి కులాలు వేరు కాగా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటానని మహేష్ యువతికి మాట ఇచ్చాడు. 2016 ఫిబ్రవరి 18న పెళ్లి చేసుకుంటానని ముహూర్తం పెట్టించాడు. అలాగే సింహాచలంలోని ఒక కల్యాణ మండపం కూడా తీసుకున్నాడు. పెళ్లి సమయానికి బాధితురాలిని కల్యాణమండపం దగ్గర వదిలిపెట్టి నిందితుడు పలాయనం చిత్తగించాడు. యువతి తనకు జరిగిన అన్యాయాన్ని నగరంలోని ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

మహిళను వేధించిన వ్యక్తికి ఏడాది శిక్ష

విశాఖ లీగల్: మహిళను వేధింపులకు గురిచేసిన వ్యక్తికి ఏడాది జైలు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ నగరంలోని 11వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి లాలం శ్రీధర్ మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో నెల రోజులు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసెక్యూటర్ బి.వి.ఆర్ మూర్తి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బాధితురాలు ఆనందపురం మండలం రెడ్డిపల్లి ప్రాంతంలోని డ్వాక్రా సంఘం ప్రతినిధిగా పనిచేస్తున్నారు. ఆమె ప్రతీ నెల శ్రీనిధి పథకానికి సంబంధించి వసూలు చేసిన డబ్బులను స్థానిక కమ్యూనిటీ కోఆర్డినేటర్ జి.చంద్రరావుకు చెల్లిస్తూ ఉంటారు. బాధితురాలపై చంద్రరావు కన్నువేశాడు. యువతకి భర్త లేకపోవడంతో తనతో సహజీవనానికి ఒత్తిడి తెచ్చేవాడు. అంతటితో ఆగకుండా యువతిని కులం పేరుతో దూషించేవాడు. చంద్రరావు వేధింపులు ఎక్కువ కావడంతో ఆమె అధికారులకు, ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నేరాభి ఒక పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

మాజీ కార్పొరేటర్ వెంగళరావు కన్నుమూత



వెంగళరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు మాజీ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు, దళిత నాయకుడు కొల్లాబత్తుల వెంగళరావు(57) మంగళవారం వేకువజామున కన్నుమూశారు. సోమవారం సాయంత్రం ఆయనకు గుండెపోటు రావడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. 2007–2012లో పాత 37వ వార్డు కార్పొరేటర్‌గా పనిచేశారు. స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు బాటలు వేశారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ 45, 46, 47, 48 వార్డులకు క్లస్టర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. కొల్లాబత్తుల మృతితో ఆయన కుటుంబ సభ్యులు, వార్డు ప్రజలు, పార్టీ నాయకులు శోకసంద్రంలో మునిగిపోయారు. కొల్లాబత్తుల పార్థివదేహాన్ని మంగళవారం సాయంత్రం 4 గంటల తర్వాత ఆయన స్వస్థలమైన కోనసీమ జిల్లా సకినేటిపల్లికి తీసుకెళ్లారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, డిప్యూటీ మేయర్లు కటుమూరి సతీష్, జియ్యాని శ్రీధర్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, కార్పొరేటర్లు చల్లా రజిని, కామేశ్వరి, హనోక్, బానాల శ్రీనివాసరావు, మాజీమంత్రి కొండ్రు మురళీ, మాజీ ఎమ్మెల్యే విష్ణు కుమార్‌రాజు, గంట్ల శ్రీనుబాబు, పార్టీ శ్రేణులు కొల్లా బత్తుల మృతికి సంతాపం తెలిపారు.

ప్రీపెయిడ్ క్యాబ్స్ ధరల సవరణ



దొండపర్తి: విశాఖ విమానాశ్రయం, రైల్వేస్టేషన్ వద్ద ఉండే ప్రీపెయిడ్ క్యాబ్స్ ధరలను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కిలోమీటర్ల ప్రకారం మినీ, సెడాన్, ఎస్‌యూవీలను పలు కేటగిరీలుగా విభజించి ఏసీ, నాన్‌ఏసీలకు వేర్వేరుగా ధరలను నిర్ణయించింది. ఒక వైపు క్యాబ్ సర్వీసులు నడిపే వారికి నష్టం లేకుండా, అలాగే ప్రయాణికులపై అధిక భారం పడకుండా ధరలను నిర్ణయించింది. బయట క్యాబ్స్ కంటే తక్కువ ధరలకే సురక్షిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకుంది. నాన్ ఏసీ ధర కంటే ఏసీ సర్వీస్‌కు ప్రతి 5 కిలోమీటర్‌కు రూ.10 అధికంగా చెల్లించాల్సి ఉంటుంది.

రైల్వేస్టేషన్, ఎయిర్‌పోర్టుల నుంచి ప్రీపెయిట్ క్యాబ్స్ ధరలు (నాన్ ఏసీ)

కిమీ	మినీ	సెడాన్	ఎస్‌యూవీ
0–5	170	200	220
5.1–10	260	310	330
10.1–15	350	410	440
15.1–20	440	520	550
21–25	540	630	670
26–30	630	730	780
31–35	720	840	890
36–40	810	940	1000
41–45	900	1050	1120
46–50	990	1160	1230
51–55	1080	1260	1340
56–60	1170	1370	1450
61–65	1270	1480	1570
66–70	1360	1580	1680
71–75	1450	1690	1790
76–80	1540	1790	1900
81–85	1630	1900	2020
86–90	1720	2010	2130
91–95	1810	2110	2240
96–100	1900	2220	2350

రైల్వే ఉద్యోగాల పేరిట దంపతుల మోసం

మర్రిపాలెం: రైల్వే ఉద్యోగం చేస్తున్న భార్యాభర్తలు.. పలువురికి రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేశారు. 5వ పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ ఎస్.సాయి తెలిపిన వివరాలివీ.. పుచ్చా రమణారెడ్డి, అతని భార్య డీఆర్‌ఎం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. 2021లో గవర కంచరపాలేనికి చెందిన అబ్బిరెడ్డి రామచంద్రారెడ్డికి తెలిసిన వారి ద్వారా పరిచయం అయ్యారు. అతని కుమారుడు, కుమార్తె, ప లువురు బంధువులకు డీఆర్‌ఎం కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగాలు వేయిస్తామని చెప్పి నమ్మించారు. ఇందుకోసం రామచంద్రారెడ్డి నుంచి రూ.29 లక్షలు తీసుకున్నారు. అయితే ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు ఆ దంపతులను ప్రశ్నించగా.. రూ.16 లక్షలు తిరిగి వారికి ఇచ్చేశారు. రోజులు గడుస్తున్నా.. మిగతా రూ.13 లక్షలు ఇవ్వకపోవడంతో వారిపై కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రామచంద్రారెడ్డి ఫిర్యాదు ఇచ్చారు. సీ ఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ రవికిశోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ప్రస్తుతం భార్యాభర్తలిద్దరూ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఉంచారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. అలాగే స్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది.

'హ్యుటగాగీ'తో ప్రతిభ వెలికితీత

- విద్యా వ్యవస్థలో నూతన విప్లవం
- ఉమ్మడి విశాఖలో నాంది పలికిన విజయభాను
- ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులు



ల్యాప్‌టాప్ ద్వారా చదువుకుంటున్న విద్యార్థులు



విద్యార్థులు రాసిన కథలతో సిద్ధం చేసిన పుస్తకాలు

ఆరిలోవ: "విద్యార్థులు సొంతంగా ఆలోచించాలి.. ఏదైనా వస్తువు, పుస్తకం, ఆట పరికరం చూసి తమంతట తామే తెలుసుకోగలగాలి.. అక్షరాలు రాయడం, కూడికలు, తీసివేతలు, గుణించడం, భాగించడం... ఏదైనా సరే విద్యార్థి తనకు తానే ఆలోచించుకోవాలి.. వచ్చిన ఆలోచనతో ఫలితం చెప్పాలి.. అప్పుడే ప్రతిభ రాటుదేలుతుందని, కొత్త విషయాలు తెలుసుకునేందుకు పురిగొల్పుతుందనేది ఓ ఉపాధ్యాయురాలి ఆలోచన.. ఆమె ఆలోచన నుంచే 'హ్యుటగాగీ' విద్యాబోధన రూపుదిద్దుకొంది..". ఈ ప్రక్రియ విద్యా వ్యవస్థలో కొత్త విప్లవానికి నాంది పలుకుతోంది. దశాబ్దాలుగా రాష్ట్రంలో అమలులో ఉన్న పెడగాగీ విధానానికి భిన్నంగా ఉన్న 'హ్యుటగాగీ' పట్ల విద్యాశాఖాధికారులు సైతం ఆసక్తి కనబరచడంతో రాష్ట్ర విద్యాశాఖ కూడా అనుమతిచ్చింది. ప్రస్తుతం ఈ విధానంలో బోధన దేశంలోని విశాఖలో మాత్రమే అమలులో ఉంది.

సొంత నిధులతో వస్తువులు సమకూర్చి..

జీవీఎంసీ 12వ వార్డు పరిధి చినగదిలి ప్రాంతం సంతపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కోటె విజయభాను మూడో తరగతికి బోధించే ఉపాధ్యాయురాలు. ఈ తరగతిలో 23 మంది విద్యార్థులున్నారు. విద్యా విధానంలో నిబంధనల ప్రకారం పాఠాలు బోధిస్తూనే ఆమె మరో కొత్త పద్ధతిలో విద్యార్థులకు అభ్యసన కల్పిస్తున్నారు. ఆమె ఇటీవల ఉపాధ్యాయ బదిలీల్లో పాయకరావుపేట నుంచి ఇక్కడకు వచ్చారు. తరగతి గదిలో నాలుగు రౌండ్ టేబుళ్లు, వాటిపై ల్యాప్‌టాప్, గది లోపల వందల కొద్దీ పుస్తకాలు అమర్చిన ర్యాక్‌లు, స్క్రీన్, కంప్యూటర్, నల్లబోర్డు, ప్రింటర్, ఇన్వర్టర్, మైక్ సెట్, ప్రొజెక్టర్, పియానో, ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. వాటిన్నింటితో ఆ తరగతి గది ఒక ప్రయోగశాలను తలపిస్తోంది. వాటితోనే ఆ తరగతి విద్యార్థులు అభ్యసనం చేస్తున్నారు. వాటిని చూసి విద్యార్థులే స్వయంగా నేర్చుకునేటట్టు ఆలోచన కల్పిస్తున్నారు. 'హ్యుటగాగీ' గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా ఆమె అవగాహన కల్పిస్తున్నారు. మీ పిల్లలు స్వయంగా అభ్యసన చేస్తున్నారని, దాని వల్ల మంచి శాస్త్రవేత్తలుగా, కొత్త విషయాలు నేర్చుకుంటారని వివరిస్తూ తల్లిదండ్రుల అంగీకారం, విద్యా శాఖాధికారుల అనుమతితో ఈ విధానాన్ని విజయభాను అమలు చేస్తున్నారు. ఈ విధానానికి ఆమె సొంత నిధులనే ఖర్చు చేస్తుండటం విశేషం. 1998లో ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరిన విజయభాను 19 సంవత్సరాల నుంచి హ్యుటగాగీపై పరిశోధన చేస్తున్నారు. పుస్తకాలు, పరికరాల కోసం ఆమె జీతంలో ప్రతీ నెల 10 శాతం ఖర్చు చేస్తున్నారు. బంధువులు, స్నేహితులు అవసరమైన కొన్ని వస్తువులు అందజేస్తున్నారు. 5 నుంచి 8 మంది విద్యార్థులకు ఒక ల్యాప్‌ట్యాబ్ ఇస్తున్నారు. సంగీత పరికరాలు, ప్రొజెక్టర్ తదితర వాటి ద్వారా ఇక్కడ విద్యార్థులు స్వయంగా అభ్యసనం చేస్తున్నారు.

'హ్యుటగాగీ' అంటే..

హ్యుటగాగీ అంటే స్వీయ అభ్యసనం. విద్యార్థి కింది తరగతి నుంచి తనుకు తానే ఆలోచించి కొత్త విషయాన్ని సొంతంగా కనుక్కోవడం. ప్రతి ఒక్కరి మెదడు ఒక్కోలా పనిచేస్తుందని విజయభాను భావించారు. కొత్తగా ఈ విధానానికి ఇక్కడ నాంది పలికారు. ఈ విధానాన్ని ఆస్ట్రేలియాకు చెందిన స్టీవర్ట్ హేజ్ అనే వ్యక్తి కనిపెట్టారు. అతనితో కలిసి విజయభాను మన దేశంలోనే మొదటిసారిగా ఆంధ్ర రాష్ట్రంలో అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 3 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు ఈ విధానంలోనే అభ్యసన కల్పిస్తున్నారు. ఈ విధానంలో ఉపాధ్యాయురాలు కోపగించుకోవడం, దండించడం ఉండదు. విద్యార్థి తప్పులు చేసినా తనకుతానే ఒప్పుకోవాలి. అబద్ధం ఆడటం, భయపడటం ఉండదు. అంతా ప్రేమ, సూచనలు, సలహాలతోనే బోధన జరుగుతుంది. ఈ విధానానికి పాఠశాలలో రోజులో రెండు పీరియడ్లను మాత్రమే ఉపయోగిస్తారు. ప్రతి శనివారం పాఠాలకు బదులుగా ప్రొజెక్టర్‌లో సినిమాలు చూపిస్తారు. కంప్యూటర్‌లో ఉపాధ్యాయురాలు కొన్ని తప్పులను చెబుతారు. వాటిని విద్యార్థులే సరిచేస్తారు.

లండన్ విద్యార్థులతో ఇంటరాక్షన్



హ్యుటగాగీలో అభ్యసన చేసిన విద్యార్థులు గతంలో లండన్‌లో విద్యార్థులతో ఆన్‌లైన్‌లో ఇంటరాక్ట్ అయ్యారు. వారితో సమానంగా ఇంగ్లిష్‌లో మాట్లాడి కొత్త విషయాలు తెలుసుకొన్నారు. నిత్యం ల్యాప్‌ట్యాప్‌లో ఇతర దేశాల విద్యార్థులతో ఆన్‌లైన్‌లో మాట్లాడుతుంటారు. హ్యుటగాగీ విధానంపై పలుచోట్ల ప్రజెంటేషన్లు కూడా ఇస్తున్నాం. ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో విద్యాశాఖ ఉన్నతాధికారుల సూచనలతో ప్రెజెంటేషన్ ఇచ్చాం. రాష్ట్రం తరఫున ప్రధాని మోదీని కలిసి పరీక్ష విధానంపై 'పరీక్ష పే చార్ట్' అందించాం. విద్యా విధానంలో కొత్త పద్ధతులు అమలుచేసే క్రమంలో 15 ఏళ్లపాటు ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ శిక్షణ ఇచ్చారు. దీనిపై ప్రత్యేకంగా తాను శిక్షణ పొందాను.

– కోటె విజయభాను

'హ్యుటగాగీ'తో విద్యార్థులకు మేలు



హ్యుటగాగీ మంచి విధానం. విద్యార్థులు సొంతంగా ఆలోచించి కొత్త విషయాలు తెలుసుకునేందుకు పునాది పడుతుంది. లక్షలాది రూపాయల విలువ చేసే పరికరాలు, పుస్తకాలు, ల్యాప్‌ట్యాప్‌లు, ప్రొజెక్టర్ తదితర వస్తువులు ఇక్కడి తరగతి గదిలో ఆమె సిద్ధం చేశారు. ఆమెకు పాఠశాల నుంచి అవసరమైన సహకారం అందిస్తాం. ఈ విధానం వల్ల భవిష్యత్‌లో విద్యార్థులకు మేలు జరుగుతుంది. అన్ని పాఠశాలల్లో అమలు చేస్తే బాగుంటుంది.

– సిరికి శ్రీనివాసరావు, హెచ్‌ఎం, సంతపాలెం, ఎంపీపీ స్కూల్